అంగన్‌వాడీ.. సమస్యల ఒడి



జిల్లాలోని విద్యార్థులకు చదువు నేర్పుతున్న ఆయా (ఫైల్)

- కేంద్రాల నిర్వహణలో ఇబ్బందులు
- ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న అధికారులు
- గర్భిణులు, బాలింతలకు తప్పని తిప్పలు

వనపర్తి రూరల్: జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత నిర్వాహకులకు ఇబ్బందులకు గురి చేస్తుంది. వీటిని భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని కేంద్రాలను ఇంచార్జులతో నెట్టుకొస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 589 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. 47 చోట్ల కార్యకర్తలు, 201 చోట్ల ఆయాలు లేరు. సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం తాత్కారం చేస్తుండంతో నిర్వాహకుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, ఆత్మకూరు ప్రాజెక్టులున్నాయి. ప్రతి ప్రాజెక్టు పరిధిలో కార్యకర్తలతో పాటు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో కార్యకర్తలే నిత్యం ఇంటింటికీ తిరిగి పిల్లలను తీసుకు రావాల్సి వస్తోంది. భోజనం తయారు చేయడమే కాకుండా పిల్లలను ఇంటికి పంపేవరకు ఆలనాపాలన చూడాల్సి వస్తోంది. ఆయా ఉంటే పిల్లలను తీసుకురావడం, భోజనం తయారు చేయడం లాంటి పనులు చేస్తుంది. పిల్లలకు బోధన, ఆటపాటలపై కార్యకర్తలు దృష్టి సారిస్తారు. ఆయాలు లేని చోట చిన్నారుల మనోవికాసంపై మరుగున పడుతున్నాయి. మూడు ప్రాజెక్టు పరిధిలో 47 కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ కార్యకర్త బాధ్యతలను సైతం ఆయాలే మోస్తున్నారు. గతంలో ఆయాలను చదువు ప్రతిపాదికన తీసుకోలేదు. దీంతో వీరు పిల్లలకు బోధించలేక పోతున్నారు. వీరు కేవలం పిల్లలను కేంద్రాలకు తీసుకొచ్చి భోజనం పెట్టి పంపుతున్నారు. కనుక కార్యకర్తలను, ఆయాల పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెబ్బేరులో గుడ్లను పంపిణీ చేస్తున్న కార్యకర్త

జిల్లాలోని మూడు ప్రాజెక్టుల పరిధిలో ఖాళీల వివరాలు

	సెంటర్లు	కార్యకర్తలు	ఆయాలు
వనపర్తి ప్రాజెక్టు	249	24	95
పెబ్బేరు ప్రాజెక్టు	189	13	59
ఆత్మకూరు ప్రాజెక్టు	151	10	47
మొత్తం	589	47	201

త్వరగా భర్తీ చేయండి



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయాల పోస్టులను త్వరగా భర్తీ చేయాలి. కేంద్రాల్లో ఆయాలు, కార్యకర్తలు లేక పోవడంతో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్హత ఉన్న ఆయాలను పదోనతి కల్పించాలి.

– బి.కవిత, అంగన్‌వాడీ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నోటిఫికేషన్ ఇవ్వాలి



జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను సేకరించాం. కొని చోట్ల కార్యకర్తలకు అదనపు బాధ్యతలు అప్పగించాం. కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ రావల్సి ఉంది. వచ్చిన వెంటనే భర్తీ చేస్తాం.

– సుధారాణి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి

క్లుప్తంగా

డిజిటల్ టెక్నాలజీపై శిక్షణ



పాన్‌గల్: విద్యలో డిజిటల్ టెక్నాలజీపై సోమవారం మండలకేంద్రం బాలుర ఉన్నత పాఠశాలల్లో గణితం సబ్జెక్టుపై శిక్షణ నిర్వహించినట్లు కాంప్లెక్స్ జీహెచ్‌ఎం నాగలీల తెలిపారు. గణితం సబ్జెక్టుపై మూడు రోజులు, 16 నుంచి 18వ తేదీ వరకు ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుపై శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యలో డిజిటల్ టెక్నాలజీ పాత్ర, ఏఐ గురించి ఆర్పీలు ఉపాధ్యాయులకు అవగాహన కలిపించారు. కార్యక్రమానికి ఆర్పీలుగా అనంద్‌గౌడ్, వెంకటేష్ వ్యవహారించారు. శిక్షణలో వీపనగండ్ల, చిన్నంబావి ఉన్నత పాఠశాలల ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



పాన్‌గల్: పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారు ఉత్తమఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కస్తూర్బా విద్యాలయం, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, గోప్లాపూర్ యూపీఎస్, కేతేపల్లి ప్రాథమిక పాఠశాల, జమ్మాపూర్ యూపీఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. పరీక్షలపై పలు విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుశాతం, విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీ గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం



గోపాల్‌పేట: ఆపదలో ఉన్నవారు, ఏ సమస్య ఉన్నవారైనా తన దృష్టికి తీసుకువస్తే తాను అండగా ఉంటానని కర్రోళ్ళ స్వప్నభాస్కర్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని చంద్రాయునిగడ్డ కాలనీలో గోకం మహేష్ గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్నాడు. తల్లిదండ్రులు ఎన్నో ఆసుపత్రులకు చూపించారని, దీంతో డబ్బులు అయిపోయి ఏం చేయలేని పరిస్థితిలోకి వెళ్లిపోయారని తెలిపారు. విషయం తెలుసుకున్న స్వప్నభాస్కర్ సోమవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చికిత్స చేయిస్తానని భరోసా కల్పించామన్నారు. తక్షణ ఆర్థికసాయంగా రూ.5వేల అందించాడు. కాలనీ యువకులు రాములు, బాలీశ్వరమ్మ, చెన్నమ్మ, సువర్ణ, గణేష్, మహేందర్, శివ, గోపాల్, శ్రీను తదితరులు ఉన్నారు.

వంటగదుల్లో పరిశుభ్రత పాటించాలి



వీపనగండ్ల: పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన తయారీకి ఉపయోగించే వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మహిళా సమాఖ్య కోశాధికారి ఎత్తం చిట్టెమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో తయారు చేసిన వంటలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల పక్రారం భోజనాన్ని తయారు చేయాలన్నారు.

అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకు



పాన్‌గల్: మండలంలోని బండపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఉన్న తాగునీటి మినీట్యాంకు, పరిసరాలు పాకరపట్టి అపరిశుభ్రంగా మారింది. ట్యాంకు ద్వారా వచ్చే నీరు కూడా అపరిశుభ్రంగా వస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకును, పరిసరాలను శుభ్రం చేసి స్వచ్ఛమైన నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాతల సహకారం మరువొద్దు



బూట్లు అందజేస్తున్న ఎంఈఓ జయశంకర్

ఖిల్లాఘనపురం: దాతలు విద్యార్థుల కోసం అందించే సహకారాన్ని ఎప్పటికి మరువొద్దని ఎంఈఓ జయశంకర్ అన్నారు. సోమవారం మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామస్థులు జోషి గోపాలశర్మ టై, బెల్టులు, షూలు, ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ దాత తో కలిసి మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలకు ఎంతోమంది దాతలు ముందుకొచ్చి అవసరమైన వస్తువులు, పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం దాత గోపాలశర్మను విద్యార్థులు, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సింగల్‌విండో డైరెక్టర్ శేఖర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, తిరుమల, బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అజీమ్ బాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లెక్చరర్ అసోసియేషన్ అధ్యక్షుడి నియామకం

వీపనగండ్ల: గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన గెజిటెడ్ లెక్చరర్ వినయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ ఏర్పడి వినయ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా నియామకం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



వినయ్‌కు ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

పాఠశాలల్లో మరమ్మతు ప్రారంభం




పనులు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామానికి చెందిన ఎస్‌ఆర్‌ఐ బూజుల భువనేశ్వర్ రెడ్డి గతంలో గ్రామానికి వచ్చినప్పుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం నరసింహారావు పాఠశాలలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన త్వరలోనే పనులు చేపడతామని హెచ్‌ఎంకు హామీ ఇచ్చారు. ఆయన సూచనల మేరకు సోదరుడు ఖగేంధర్‌రెడ్డి సోమవారం పాఠశాల కాంపౌండ్, డయాస్ నిర్మాణ పనులు చేపట్టారు. ఆర్వో వాటర్ ఫిల్టర్, ప్రింటర్ విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నారాయణరెడ్డి, వెంకట్రామరెడ్డి, రవికుమార్‌రెడ్డి, సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అమరచింత: రోజు రోజుకు సైబర్ నేరాలు అధికమవుతున్నాయని వీటిపై ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ స్వాతి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం సైబర్ నేరాలు, బాల్య వివాహాలతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లో వచ్చిన ప్రతి మెసేజ్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అపరచిత వ్యక్తులు ఫోన్‌లో మాట్లాడుతూ.. మీ బ్యాంక్ ఖాతా నంబర్‌తో పాటు అధార్‌కార్డు నంబర్ నమోదు కాలేదని చెపుతుంటారని, అలాంటి వాటికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలని, ట్రాలీ ఆటోల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. బాల్యవివాహాలకు సహకరించిన నేరమన్నారు.

నీటి వృథా.. అరికట్టేదెలా !



దశమికట్ట వద్ద వృథాగా పోతున్న ట్యాంకు నీరు

అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రతినిత్యం ఓవర్ ఫ్లో ద్వారా తాగునీరు వృథాగా పారుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. దీంతో ట్యాంకులోంచి నీరు రోడ్లపై పారుతుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. విషయాన్ని మున్సిపల్ అధికారులకు, పాలక వర్గానికి తెలిసినా అరికట్టలేక పోతున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, దశమికట్ట వద్ద ప్రతినిత్యం వాటర్ ట్యాంకులు నిండుకొని నీరురోడ్లపై పారుతున్న మిషన్ భగీరథ అధికారులు, స్థానిక వాటర్ లైన్‌మెన్ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోని నీటి వృథాను అరికట్టాలని ప్రత్యామ్నయ త్వరితగతిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు తెలుపుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయంలో ఆరుద్ర పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో గల దత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఏకదశ రుద్రాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. పరమశివుడి జన్మనక్షత్రమైన అరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో శివలింగానికి అర్చకులు పాలాభిషేకం ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్నదానం చేశారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో బోర్డులను వితరణగా అందజేశారు. ఫోరం సభ్యులు మేడిపల్లి యుగంధర్, శివకుమార్ ఆధ్వర్యంలో మైపాల్‌రెడ్డి ఎంఈఓ నర్సింహతో కలిసి బోర్డులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షబీర్‌అహ్మద్, ఉపాధ్యాయులు మహేష్, శంకర్, ప్రేమ్‌నాయుడు, శ్రీనివాసులు, నిరంజన్, పీఈటీలు శ్రీకాంత్, శ్రీనివాసులు, సీఆర్‌పీలు వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకై రాష్ట్రబంద్‌కు మద్దతు



వనపర్తి విద్యావిభాగం: బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం బీసీ జేఏసీ పిలుపునిచ్చిన ఈనెల 18న రాష్ట్ర బంద్‌కు జిల్లాలోని అఖిలపక్ష ఐక్యవేదిక, బీసీ ఐక్యవేదిక సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని అఖిల పక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం పలు బీసీ సంఘాలు ఏకమై బీసీ జేఏసీగా ఏర్పడి, ముందుగా 14న పిలుపునిచ్చిన రాష్ట్రబంద్‌ను ఇప్పుడు 18వ తేదీకి మార్చి ప్రకటించాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు అందరూ బంద్‌కు మద్దతు తెలపాలన్నారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలో 19న బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న మోటార్ సైకిల్ ర్యాలీలోనూ అఖిలపక్ష ఐక్యవేదిక పాల్గొంటుందన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ సోదరులు అందరూ ర్యాలీలో పాల్గొని ఐక్యతను చాటుకోవాలన్నారు. తమ హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గొనికాడి యాదయ్య, జి.టి. శ్యామ్, రాజనగరం రామస్వామి, గంధం భరత్, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలకు ఇచ్చిన హామీల బాకీ కట్టండి'



పెబ్బేరులో బాకీ కార్డులను అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘనపురం: ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బాకిని కట్టాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య , మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఐదో వార్డులో మండల బీఆర్‌ఎస్ నాయకులు, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డితో కలిసి ఇంటింటికి తిరుగుతు బాకి కార్డులు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇష్టం వచ్చిన హామీలు ఇవ్వడం తరువాత పక్కన పెట్టడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందని వారు చెప్పారు. కార్యక్రమంలో వెంకటేష్, బెస్తగోపాల్, గొడుగు సత్యం, రాఘవేందర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, రాంచంద్రి ముదిరాజ్, చిన్న అంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, దోరటి మహేష్, బుచ్చిబాబుగౌడ్, చెన్నయ్య ముదిరాజ్, సింగోటం, శేఖర్, యాదగిరి, శంకర్, మన్యం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో బాకీ కార్డులు పంచుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బాకీ కార్డులు పంపిణీ

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ నాయకులతో కలసి సోమవారం 12వ వార్డులో బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యాభరోసా, విద్యార్థినులకు స్కూటీలు, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, రైతు కూలీలకు, ఉపాధి కూలీలకు రైతుభరోసా తదితర వంటివి బకాయి పడ్డారన్నారు. ప్రజలు ఈ బాకీకార్డు చూయించి స్థానిక ఎన్నికల్లో వచ్చే కాంగ్రెస్ నాయకులకు నిలదీయాలని ప్రజలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిన్న ఎల్లారెడ్డి, రామకృష్ణ, విశ్వరూపం, హరిశంకర్ నాయుడు, సాయిరెడ్డి, మజీద్, కుమ్మరాజు, వేణు, వీరస్వామి నాయుడు, నాగిరెడ్డి, నరేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



కలెక్టర్ కార్యాలాయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వనపర్తి రూరల్: సీజేఐ బీఆర్ గవాయిపై దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు అన్నారు. ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు జిల్లా ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యలాయం ఎదుట నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి, గంధం గట్టయ్య, మాదిగ, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, సిరివాటి శ్రీనివాసులు, బేడ బుడగజంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు పాల్గొని మాట్లాడారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజేఐ దళితుడు కావడం వల్లే దాడి జరిగిందన్నారు. వెంటనే ఇటువంటి చర్య పాల్పడిన న్యాయవాదిని అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరుశరాముడు, తిరుపతి, రాములు, గంధం నాగరాజు, ఆవుల కురుమూర్తి, శ్రీనివాసులు, చందాపురం బాలస్వామి, మన్యం, గంధం కృష్ణయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

అమరచింత: మండలంలోని దేవేంద్రచార్యుల మఠంలో దేవేంద్రచార్యుల ఆరాధనోత్సవాలు గత మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. సోమవారం ఆరాధనోత్సవాల ముగింపు కార్యక్రమంలో భక్తులు అశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు. గాయత్రి పీఠాధిపతి శ్రీకాంత్రేంద్ర స్వామి, కర్నాటకలోని గుండేపల్లి పీఠాధిపతి కాళి కామాత ఉపాసకులు నరేష్ స్వామి భక్తులకు సన్మార్గంలో పయనించేందుకు భగవంతుడిని పూజిస్తూ గురువులను పూజించాలన్నారు. ముగింపులో అమ్మపురం సంస్థానాదీశుడు శ్రీరాంభూపాల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, జలంధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మికాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, జగన్మోహన్‌రెడ్డిలతో పాటు నిర్వాహకుడు నరసింహాచారి పాల్గొన్నారు.

'1962' అంబులెన్స్ సిబ్బందికి జీతాలు లేక ఇక్కట్లు

కొత్తకోట: సంచార పశు వాహనాల ద్వారా సేవలను అందిస్తున్న 1962 అంబులెన్స్ సిబ్బందికి గత మూడునెలలుగా జీతాలు లేక ఇక్కట్ల పాలవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1962 వాహనాలు 14 అందుబాటులో ఉన్నాయి. ఇవి మూగ జీవాలకు ఎటువంటి ఆపద వచ్చిన 1962 నెంబర్‌కు కాల్ చేసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ప్రథమచికిత్స చేసి అవసరమైన మందులను అందించి మూగజీవాల పాలిట ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు అంబులెన్స్ సిబ్బంది. ఇంతచేసినా సిబ్బందికి వేతనాలు మూడు నెలలుగా సరిగ్గా ఇవ్వడం లేదని బాధను వెలిబుచ్చారు. దీంతో కుటుంబపోషణ భారమై పిల్లల చదువులకు ఫీజులు చెల్లించడానికి అప్పులు చేయాల్సి వస్తుందని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నట్లు సిబ్బంది ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి 1962 సిబ్బంది సమస్యలను పరిష్కరించి వేతనాలను విడుదల చేయాలని కోరారు. లేని పక్షాన సమ్మెకు వెళ్తామని తెలిపారు.



పశువులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

కొత్తకోట రూరల్: గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ముఖ్యంగా రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట మండలంలోని ముమ్మళ్లపల్లి–పుల్లారెడ్డికుంట వరకు నూతనంగా వేయనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్‌హెచ్–44 ముమ్మాళ్లపల్లి గ్రామం నుంచి పుల్లారెడ్డి కుంట వరకు బీటీ రోడ్డును రూ.97 లక్షల వ్యయంతో నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించి, భూమిపూజ చేయడం జరిగిందన్నారు. అనంతరం నాంచరమ్మపేట గ్రామ సమీపంలో గల ఉర్సే షరీఫ్ ఉర్సుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. రాయిణిపేట గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ వైద్య చికిత్స నిమిత్తం రూ.1.50లక్షల ఎల్ఓసీని అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఎస్‌జే.బోయేజ్, పి.కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, శివరాజు, మాసన్న, శివరాములు, ఇరు గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.

108 వాహనాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారి



పెబ్బేరులో 108 సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి మహబూబ్

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 108 అంబులెన్సును జిల్లా అధికారి మహబూబ్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు త్వరితగతిన అత్యవసర వైద్యసేవలు అందించడంలో 108 సేవల పాత్ర ఎంతో ముఖ్యమని, కాల్ వచ్చిన వెంటనే స్పందించాలన్నారు. అలాగే సిబ్బంది డ్యూటీలో పూర్తి నిబద్ధతతో వ్యవహా రించాలని వారికి సూచించారు. అంబులెన్స్‌లోని మెడికల్ ఎక్విప్‌మెంట్స్, మెడిసిన్స్ సేఫ్టీ గాడ్జెట్స్ అన్ని సక్రమంగా ఉన్నాయో లేదో నిరంతరం చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎండీ ఖాజఫరూఖ్, మాసుంబాబ పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

అమరచింత: పురపాలికలో రూ.15కోట్లతో మంజూరు అయ్యాయని కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారని ఇప్పటివరకు మంజూరైన నిధుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేక పోవడం ఏమిటని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ ప్రశ్నించారు. మంత్రి వాకిటి శ్రీహరి పట్టణంలో స్టేడియం కోసం రూ.కోటి మంజూరు చేస్తున్నామని ప్రకటించారని, ఇప్పటివరకు స్టేడియం పనులు సైతం మొదలు కాకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అమరచింత పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రవి,అంజిలు పాల్గొన్నారు.